# కీలుబొమ్మ

రైలు ప్రయాణం చేసేటప్పుడు మొత్తంమీద రక రకాల మనుష్యులు తటస్థపడుతుంటారు.

అతనంతట అతనే నన్ను పలకరించాడు. నాకు నేనై కొత్తవాళ్లను పని లేకుండా సామాన్యంగా పలకరించను. ఎందాకా నన్నాడు. చెప్పాను. ఎక్కణ్ణుంచన్నాడు, అదీ చెప్పాను. ఏవేవో సంగతులు తెచ్చాడు అతని ఉత్సాహం స్నేహభావం నాకూ అంటుకున్నై. మనిషి చాలా అందంగా నాజూకుగా వుంటాడు. అతని మొహంలో ఆనందం, ఆరోగ్యం తాండవిస్తున్నై. అతని జన్మలో చింత కాని, ఆగ్రహం కాని వున్నట్లు లేదు. అతని మొహాన నవ్వటాని కలవాటుపడ్డ లక్షణాలున్నై కాని కోప్పడటానికి, దుఃఖించటాని కాని ఆ మొహం అలవాటుపడ్డట్టు లేదు డబ్బు పుష్కలంగా వుండి విరివిగా ఖర్చుపెట్టే మనిషల్లే కనపడ్డాడు. అతిశయం కాని బెట్టుసారి కాని వున్నట్టు లేదు మనిషి దగ్గిర. ఎక్కువ తెలివి గలవాడల్లే కనిపించలేదు కాని మందమతి కాదు.

మా సంభాషణ యెలా వెళ్ళిందో 'విధి' మీదికి వెళ్లింది.

'మనుషునకు విధి వున్నట్టే దేశాలకూడా విధి వుంటుంది కామాలు?' అన్నాడతను.

నేను నవ్వి, 'మనుష్యులకు విధి వుంటుందని రుజు వెక్కడయింది?' అన్నాను.

అత నాశ్చర్యంతో 'ఎందుకాలేదు ?' అన్నాడు. అతని మొహంన ఆశ్చర్యం చూసినప్పుడు ఒక కొత్తవిషయం కనిపెట్టాను. ఆశ్చర్యంలోకూడా నవ్వటానికి వీలున్నప్పుడు నవ్వులో ఎందుకు నవ్వకూడదు ? అందుచేతనే అతని నవ్వులో వెన్నెలు కాయటం ! బహుశా అందుకనే కొందరి నవ్వు చవితివెన్నెలల్లే వుంటుంది.

సరే నేను 'ఎక్కడయిం' దన్నాను. అతను నవ్వుతూ 'నేను రుజువు చేశాను' అన్నాడు.

'వృథం డుండండి ! మీ వుద్దేశంలో విధి అంటే ఏమిటి ? యెందుచేతంటే కర్మఫలితాన్ని నేను విధి అని అంగీకరించను. పంచదార తీపిగా వుండటానికి కే విధీ సహాయ్యం చెయ్యక్కర్లేదు. అదే విధి అయితే దేశాలకూడా విధి వుంది. కొద్దిమంది వ్యక్తులు చేసిన కర్మయొక్క ఫలితం దేశ మంతా అనుభవిస్తుంది. అప్పుడు దేశాలకూడా విధి వుంటుంది మరి.'

అతను మెల్లిగా తల అడ్డంగా తిప్పాడు.

'అదికాదు నేను చెప్పే విధి. విధంటే మనం మనో

వా కార్యాలా చేసే కర్మకు సంబంధం లేకుండా మన భవిష్యత్తును నిర్ణయించేది. అటువంటి విధంటూ వుందని మీరు నమ్ముతారా ?'

'ఎన్నటికీ నమ్మను ! ఖచ్చితంగా చెప్పగలను. తన యిష్టానుసారం మనల్ని నడిపించే విధి వుందని ఎవరైనా నిరూపిస్తే నేను జీవితంలోనూ, న్యాయంలోనూ, ధర్మం లోనూ అర్థంలేదని ఒక్క క్షణంలో నిరూపిస్తాను' అన్నాడు.

'మీరు చెప్పింది నిజం. వాటిల్లో అర్థంలేదనే తీర్మా నానికి నేనూ అదివరకే వచ్చాను. వాటిని నే నిప్పుడు పాటిం చటం లేదు!' అన్నాడతను.

నేను నిర్ఘాంతపోయినాను. అతను అర్థం ఆడు తున్నాడో. లేక న్యాయం, నీతీ, ధర్మం మొదలయినవి పాటించనివాడి మొహాన 'లుచ్ఛా' అని రాసివుంటుందని నే నింతకాలం అనుకోటం పొరపాటా ? ఇటువంటి వాటికి సంఘంలో ఎక్కువ ప్రాముఖ్యత యిస్తున్నామని రుజువైతే ఇప్పుడు చేస్తున్నట్టుగా ప్రతివాడూ మిగిలినవాళ్లు లోపం లేకుండా కాలయాపన చెయ్యకుండా చాలా సుఖంగా జీవించవచ్చునేమో?

'ఏమి టాలోచిస్తున్నారు?' అన్నాడతను.

'అంటే, మరేమీ లేదు. మీరు ఒకమాటకు ఒక మాట ఉపయోగిస్తున్నారేమోనని నా అనుమానం !... ముందు విధంటూ వుందని రుజువుచెయ్యండి చూద్దాం! తర వాత నా ఆలోచన చెబుతాను.'

అతను బిగ్గరగా నవ్వి 'విధంటూ లేదని మీ కెలా తోచిందండీ! ప్రతి రయితూ సాలుకు కొన్ని లక్షల వరి మొక్కల తదితర జీవాలను తన ఇచ్ఛానుసారం పెంచి చంపుతున్నాడు. మనం మన పెంపుడు జంతువులను మన ఇష్టానుసారం పెంచటమేకాక మనయిష్టం వచ్చిన కొత్త జాతులు పుట్టిస్తున్నాం. సృష్టికి మనిషే నాయకుడా? మనిషి మీద యింకా ఎన్నిరకాల జీవరాసు లున్నయో? ' అన్నాడు.

'వుంటే కనిపించవేం?'

'మనం చెట్లకేం కనిపిస్తాం?'

'అదా మీ వాదన? అసలు చెట్లకు ప్రాణం వుందని అంతా ఒప్పుకోలేదు?' అని ఒక చొప్పదంటు వాదన అడ్డం పెట్టాను.

'మనకు ప్రాణం వుందని ఎవరు రుజువు చేశారు. ఎవడో కథలో రాక్షసుడి ప్రాణం ఎక్కడో దాచిపెట్టి ఈగల్లో వున్నట్టు మన ప్రాణం గుండెకాయ మొదలైన వాటిలో వుండవచ్చును. అవి వేరే ప్రాణులు కావని ఎవరు నిరూపించారు? అటువంటి తెలీని విషయాలు మనకొద్దు. చెట్లు కర్మచేస్తున్నై. వాటికి మంచి చెడ్డలున్నై. చెట్టు తన మేలుకోసరం ఆకులను చీల్చుకుంటుంది, రాల్చుకుంటుంది. అది కర్మకాదా? దాని ఆహారం అది వెతుక్కుంటుంది. మనం అంతకన్న చేస్తున్నదేమిటి? మనకన్న తక్కువ తరగతి ప్రాణులను చూసి మనమే వున్నతంగా వున్నామని

అహంకరించటం ఎందుకు? మనకన్న పెద్దతరగతి జీవాలు కొన్ని పరిపాలిస్తున్నట్టు నేను గట్టిగా నమ్మను. వాటికి మనం లొంగిఉండక చేసేదేమీ కనిపించలేదు'

'మనకన్న ఎక్కువవాళ్ళు మనల్ని కీలుబొమ్మలాడించినట్టు ఆడిస్తున్నారని మీ కెలా నమ్మకం కలిగింది?

'కానండి. నేను చిన్నతనంలో రెండుసార్లు చచ్చి బతికాను. మాటవరస కనటంకాదు. నిజంగా చచ్చి బతికాను! మా నాన్న గొప్ప డాక్టరు. రెండుసార్లుకూడా ఆయనా ఆయన స్నేహితులయిన పెద్దడాక్టర్లూ నా ప్రాణం పోయిందని సర్టిఫై చేశారు. రెండుసార్లుకూడా ఒక ఔషధ సహాయంగాని ఒక చికిత్సగాని లేకుండానే బతికాను. నన్నెవరు బతికించారు?

'నా జీవితంలో ఇటువంటివి శత సహస్రాలు. నా వివాహం గురించి చూడండి. నా పెళ్ళి నిశ్చయమైన కొద్దికాలానికే యీ సంబంధం నా యజమానికి - నన్ను ఆడిస్తున్న దేవతకు - యిష్టంలేదని నాకు తట్టింది. ఎవరితోనూ చెప్పలేదు. ఆ వివాహం అయిదురోజులూ నాకు ఇదీ అదీ అని తెలీనిరోగం! నా భార్య కాపరానికి వచ్చిన తరవాత మా ఇద్దరిమధ్యా ఎవరో అడ్డం వస్తూనే వుండేవాళ్లు. పానకంలో పుడకల్లే. ఏమీ జరక్కుండానే నా ఉత్సాహం యావత్తూ ఎక్కడికో పీల్చుకుని పొయ్యేది. అటువంటిది కేవలం సైకలాజికల్ అని అనగలరు. నేనప్పటికి విధిలో నమ్మకం కలవాణ్ని కాను. ఈ కనిపించని భూతం నాకూ నా

భార్యకూ మధ్య పెట్టనిగోడ అయిపోయింది. నా భార్య చాలా మంచిది. మొదట్లో నాకు దాన్ని చూస్తే యెంతో ప్రేమ. నా భార్య ఎదురుగా లేనంతసేపూ దాన్నిగురించే ఆలోచించేవాణ్ని. ఎదురుగా రాగానే నా కళ్ళలో కారం కొట్టి నట్టయ్యేది. లోపలనించి విపరీతమయిన అసహ్యం పుట్టేది.

'చాలాకాలం ఈ దయ్యాన్ని తోలెయ్యాలని ప్రయత్నం చేశాను. అప్పటికింకా ఈ దయ్యం నాలోనే వుందని నా భ్రమ నాకు బాహ్యంగా వుందని తెలీదు... చివరకు నా భార్యను వదిలేశాను!

'ఆ రోజుల్లో నా స్తితి చాలా భయంకరంగా ఉంటూ వచ్చింది. మా నాన్న ఏమీ మిగిల్చిపోలేదు. ఇన్నూరెన్ను ప్రీమియములు కట్టటం మానేసి దానధర్మాలు చేశాడు! నా విద్యాభ్యాసం మధ్యలో తెగిపోయింది.

'నా భార్యను పుట్టింటికి పంపించేసిన మర్నాడు నేనెన్నడూ ఎరగని పెద్దమనిషి మా నాన్న స్నేహితుణ్నంటూ వచ్చి నాకు వుద్యోగం యిస్తానన్నాడు!

'నకు భోగంవాళ్ళంటే ఎప్పుడూ అసహ్యమే! ఒక రోజున నేను సాని వీధివెంబడి పోతుండగా నన్నెవరో ఒక యింట్లోకి పొమ్మని ప్రేరేపించి నట్టయింది. ఆ యింటిది తాగుబోతు. వుత్త దరిద్రపు లంజ. నాకు దాన్నిచూస్తే ఆవగింజంత ప్రేమలేకపోగా పరమ అసహ్యం. అయినా ఆ యింట్లో దూరాను! మర్నాడు ఒక పెద్దమనిషి నన్ను వాళ

బాంకు ఏజంటు దగ్గిరికి తీసుకుపోయి నెలకు డెబ్భై రూపా యలమీద నన్ను గోడౌన్ కీపరుగా నియమింపచేశాడు. నాకా పని కూడా తెలీదు. ఆ వుద్యోగంలో వుంటూ నా కిష్టంలేనివీ ఏవడయినా వింటే నోట్లో వుమ్మేసేవీ అనేక పనులు చేశాను. నా మీద కేసులుకూడా వచ్చినాయి.నన్ను నా జయమూని దివ్యంగా తప్పించాడు నా ప్రయత్నం ఏమీ లేదు. నా అభివృద్ధికి ఏమీ లోపం రాలేదు. కొద్దికాలం కిందటే నన్ను ఏజంటు చేశారు. ఇప్పుడు రెండువందల యాభై యిస్తారు!

'నే నిప్పుడు ఎవర్ని తప్పుపట్టను. నన్ను తప్పుపడితే సహించను! నా జీవితానికి నా అనుజ్ఞ యెంత మాత్రం లేకుండా వుంటున్నది. నేనేం చెయ్యాలి? నన్ను పట్టిన గ్రహం చాలా దుష్టగ్రహంగా కూడా వుంది! భగవంతు డనే వాడుంటే అతణ్ని చాలా కాలంనించి ప్రార్థిస్తున్నాను నన్ను మంచి గ్రహం చేతులో పారెయ్యవయ్యా అని.ఇంకా నా మొర ఆలకించలేదు భగవంతుడు.'

నేను కొంచంసేపు ఆలోచించి 'చాలా విచిత్రంగా వుంది-నిజమయితే! కాని ఒక్క కేసునుబట్టి ఏమీ తేల్చ లేం' అన్నాడు.

'ఒక్క కేసా! వందలు, వేలు చూపిస్తాను! మీరా మాట అనటంబట్టి మీరీ విషయాన్ని గురించి ఎన్నడూ ఆలోచించలేదని తెలుస్తుంది. నా అనుభవం వొకటి

వినండి. నేను ఒకప్పుడు ప్రతి ఆడదీ పతివ్రతే అను కునేవాణ్ని. అప్పుడు నాకు రంకువాళ్ళను గురించి ఆలోచనేలేదు. తరవాత ఎందుచేతనో ఆ విషయం ఆలో చన వచ్చినప్పుడు గమనిస్తే దాదాపు నే నెరిగిన ప్రతి ఆడదీ రంకుతనం చేసినమనిషే! ఇంటికొకత్తె! అనేక విషయాలను గురించి ఆలోచించక మనం జీవితంలో నూటికి తొంబై తొమ్మిదిపాళ్లు అసలు చూడనే చూడటంలేదు— విచారించ టంమాట దేవుడెరుగు!— నేనిప్పుడు నా జీవితంలో నలుసు లన్నీ ఏరి తెచ్చాను కనుక నా జీవితం విపరీతమైనట్టు మీరు భావించుకుంటారు. కాని అందరి బతుకంటిదే నాదికూడా. కారణం లేకుండా భార్యను వదిలేసిన వందల్లో నే నొకణ్ని. లంచాలు పుచ్చుకుంటున్న వేలల్లో నేనూ ఒకణ్ని. ముండల ఇళ్ళచుట్టూ తిరిగి సాధ్యమైనంతవరకూ తప్పించుకుంటూ పొరపాటున తగిలితే వెంటనే నయం చేసుకుంటూ తిరుగు తున్న కొద్దిమందిలో నే నొకణ్ని. నన్ను బాగా ఎరిగినవాళ్లు విపరీతంగా చూడనేచూడరు!'

నే ననుమానంగా తల ఊపాను.

'అందుకనే కృష్ణుడిన్నీ, తక్కువ దేవతలను కొలవక తన్నే నమ్మి వుండమన్నాడు! వీళ్ళను జయించటానికి ఇంద్రియ నిగ్రహం కావాలి!'

'అదీ ఆలోచించాను. ఆ భగవంతుడి స్వరూపం తెలిస్తేకద ఆయన్ను నమ్మటమనేది జయప్రదంగా జరిగేది. నేను నమ్మే వున్నాను. ఇక తక్కువ దేవతలను ఎదిరించటం

మాటా ? మనిషికి ఎదురుతిరిగిన కుక్క మనిషికన్న ఎక్కువే అవుతుందో తోడేలే అవుతుందో ? నాకు వృద్ధి పొందాలనే వుంది కాని క్షీణించాలని లేదు. ఇప్పటిమటుకు ఒక్కపని చేస్తున్నాను నన్ను రెండు భాగాలు చేసుకున్నాను. ప్రస్తుతం అందులో ఒక భాగం మాత్రమే విధికి లొంగివున్నట్టూ రెండో భాగం దానికి ఎడంగా వుండి దాని మంచిచెడ్డలను నిశ్చింతగా గమనిస్తున్నట్టూ నటిస్తున్నాను. అసలటువంటి రెండోభాగం నాలో వున్నట్టే వుంది. కేవలం సైకలాజికల్ ఎఫెక్టే కావచ్చును మరి!' అంటూ అతను నవ్వాడు.